# రిపోర్టులు

## ఆదిలాబాద్ I:
## కాంగ్రెస్ (ఐ) వారి కారంచేడు

కారంచేడు గురించి కాంగ్రెస్ (ఐ) వారుచేసిన అల్లరి చూసి చాలామంది ఆశ్చర్యపోయారు. కాంగ్రెస్ పాలనలో హరిజనులపైన అత్యాచారాలు ఎన్నడూ జరగలేదనా, ఇంతగోల చేస్తున్నారెందుకు? అని చాలామంది అనుకున్నారు. అలా అనుకున్నవాళ్ళు అర్థంచేసుకోవాలని విషయం ఏమిటంటే కాంగ్రెస్ వారి దృష్టిలో బలహీనవర్గాలు తమ స్వంత ఆస్తి. వాళ్ళని ఆర్చినా హతమార్చినా అది తాము చేయవలసిందేతప్ప ఇతరులు చేయడానికి వీలులేదు. అంతేతప్ప తమపాలనలో బలహీనులు చంపబడలేదని కాదు.

ఆదిలాబాద్ ఎం.ఎల్.ఏ రామచంద్రారెడ్డిగారు 'ఇండిపెండెంట్' అభ్యర్థిగా గెలిచి తరువాత కాంగ్రెస్ (ఐ)లో చేరాడు. ఆదిలాబాద్ పట్టణానికి ఏడు కిలోమీటర్లు దూరానవున్న ఖోడద్, హస్నాపూర్ అనే జంట గ్రామాలలో ఆయన బంధువులున్నారు. వీళ్ళు జూన్ - జూలై నెలలలో ఆ గ్రామాలకు చెందిన అరుగుల దేవన్న అనే చాకలిని, శేర్ల లక్ష్మన్న అనే మంగలి యువకుడిని హత్యచేసి, ఒక శవాన్ని బావిలో, ఒక శవాన్ని వాగులో పారేసి, రెండు హత్యలనూ గూడా ఆత్మహత్యలుగా చలామణి చేసారు. ఇంత గ్రంథాన్ని ఇంట్లో దాచుకొని రామచంద్రారెడ్డిగారి పార్టీ కారంచేడు గురించి అసెంబ్లీలో గొంతు చించుకుంది.

సదరు బంధువులు కంది గణపతిరెడ్డి, చిలుకూరి మనమోహన రెడ్డి అనే వ్యక్తులు. వీళ్ళకు 20 ఎకరాల దాకా భూమి, భూస్వామ్య పెత్తనం ఉన్నాయి. గణపతిరెడ్డికి హస్నాపురంలో సారా దుకాణం వుంది. జూన్ 13 సాయంత్రం 6 గంటలప్పుడు ఈ మిత్రులిద్దరూ గణపతిరెడ్డి సారా దుకాణంలో కూర్చొని మందు ఆరగిస్తున్నారు. తమ ఇంటి చాకలి అయిన అరుగుల దేవన్న (35 సం॥ వయసు)ను పిలిచి, గ్రామంలోని ఒకవేశ్యనుతీసుకురమ్మని పంపారు. ఆ అమ్మాయి రానన్నదని దేవన్న తిరిగి వచ్చి చెప్పాడు. మళ్ళీ అడిగి రమ్మంటే దేవన్న మళ్ళీ పోయి వచ్చి అదే సమాధానం చెప్పాడు. దానితో దొరలిద్దరికీ కోపం వచ్చింది. ఆమె రాకపోతే నీకు భార్యలేదా చెల్లెలు లేదా తీసుకురమ్మన్నారు. దేవన్నకు సహనం నశించి తిరిగి ఏదో అన్నాడు.దొరలు అతన్ని అక్కడికక్కడే ఖాళీసారాసీసాలతోకొట్టారు. లాగి సారా దుకాణంలో పడేసారు. ఇదంతా చూసిన వాళ్ళు గొల్ల రాములు, గొల్ల లక్ష్మీబాయి, కమ్మరి బ్రహ్మం, మంగలి లక్ష్మన్న. ఆ రాత్రి గడిచి తెల్లవారబోతుండగా దొరలిద్దరూ శవాన్ని బయటకు తెచ్చి సారా దుకాణం ఎదురుగా వున్న బావిలో పడేసారు. 14 గడిచి 15 ఉదయం శవం బావిలో వున్నట్టు తెలిసింది. బంధుమిత్రులు దాన్ని బయటకు తీసారు. తాంసి పోలీస్ స్టేషన్‌కు కబురుచేయగా హెడ్ కానిస్టేబిల్ రఘువీర్‌గౌడ్ వచ్చాడు.

ఈ ప్రాంతపు చాకలి కులస్తులు వీరశైవులు. వీళ్ళు చనిపోయిన తరువాత మృతదేహాలను దహనంచేయరు, పూడ్చిపెడతారు. అయితే దేవన్న శవాన్ని పూడ్చిపెడితే మళ్ళీ బయటకు తీసి శవ పంచాయితీ జరిపే అవకాశం వుంటుంది కాబట్టి, గ్రామంలోని రెడ్లు హెడ్‌కానిస్టేబిల్ రఘువీర్‌గౌడ్, దేవన్న బంధువులను ఒత్తిడిచేసి వాళ్ళకు కట్టె గూడ సరఫరాచేసి దహనం చేయించారు.

ఈ విషయాన్ని ఆదిలాబాద్ రజక సంఘం బయటకు తీసి గొడవచేయగా, మృతదేహాన్ని శవపంచాయితీ జరపకుండా దహనం చేయనిచ్చినందుకు హెడ్‌కానిస్టేబిల్‌ను సస్పెండ్‌చేసారుగాని, కేసును హత్యగా నమోదు చేసుకొని సాక్షులను విచారించడం మాత్రం జరగలేదు. అయితే ఒక నెల రోజులపాటు రజక సంఘం ఆలజడిచేస్తూనే వుంది. సాక్షులలో ఒకడయిన 16 సంవత్సరాల శేర్ల లక్ష్మన్న తాను చూసిన విషయం అడిగిన వారందరికీ చెబుతూనే వున్నాడు. అదే అతనికి ప్రాణాంతకమయింది. జూలై 18 ఉదయం అతను ఇంటి నుండి బయలుదేరి పొలంవైపు వెళ్ళాడు. సాయంకాలం దాకా తిరిగి రాకపోయినా తల్లి పోచ్చుబాయి గాబరా పడలేదు. ఆదిలాబాద్‌లో క్షవరశాల పెట్టుకున్న పెద్దకొడుకుల దగ్గరికి పోయాడేమో ననుకుంది. అయితే మరుసటిరోజు ఉదయం తన భర్తను కలవడానికి దేగాం గ్రామం వైపు బయలుదేరింది. తోవలో (గ్రామందాటగానే) మోకాలిలోతునీళ్ళున్నవాగులోకొడుకుశవంకనబడింది. అతనికణతమీదగాయం వుంది. అతను చక్కగా ఈదగలడని, ఆరోగ్యవంతుడని, ఏ బాధలూ లేవని, కాబట్టి మోకాలులోతు వాగులో 'మునిగి' పోవడంగాని, ఆత్మహత్య చేసుకోవడంగాని, అవకాశంలేని విషయాలని తల్లి అంటుంది. అయితే పోలీసులు మాత్రం లక్ష్మన్న హత్యను గూడ దేవన్నహత్యలాగే 'ఆత్మహత్య'గా నమోదు చేసుకున్నారు.

పోలీసుల ఈ వింత వైఖరికి కారణమేమిటో సస్పెండ్ ఐన హెడ్‌కానిస్టేబిల్ రఘువీర్‌గౌడ్ బయటపెట్టాడు. రజక సంఘం అధ్యక్షుడు సదాశివంగారి దగ్గరికిపోయి 'ఎం.ఎల్.ఏ రామచంద్రారెడ్డిగారి తమ్ముడు లచ్చిరెడ్డిగారి ఒత్తిడిమీద నేను కేసు మూసేసాను. ఇప్పుడు ఫలితం నేను అనుభవిస్తున్నాను' అన్నాడు.

ఈ కాంగ్రెస్ (ఐ) వారి కారంచేడు మీద తెలుగుదేశం ప్రభుత్వం (తన స్వార్థం కోసమయినా) న్యాయవిచారణ జరిపిస్తుందా?

## పోలీసు కస్టడీలో మరణం :
### నెల్లూరుజిల్లా (విడవలూరు)

ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్యగారి స్వగ్రామం అలగానిపాడు. నెల్లూరుజిల్లా విడవలూరు మండలంలో వుంది. అలగానిపాడుకు చెందిన వడ్లమూడి వీరరాఘవయ్య అనే 70 సంవత్సరాల చాకలిని పోలీసులు చంపారు.

ఈ ప్రాంతం నెల్లూరు జిల్లాలో అభివృద్ధిచెందిన ప్రాంతం కింద లెక్క. అయినా ఈ గ్రామంలోని చాకలి, మంగలి తదితర కులస్థులు ఇప్పటికీ ప్రాచీనకాలపు ఏర్పాటుక్రింద పనిచేస్తారు. బట్టలు